# ఈ పెండ్లి నిలుస్తుందా!

"నాకు విడాకులు కావాలె!–" అంది తొణకని గొంతుతో మానసి. ఆమె కండ్లల్లో కన్నీళ్ళు లేవు. కండ్లు విప్పార్చి రెప్పవేయకుండా పక్కనే సోఫాలో కూర్చున్న తల్లితండ్రి వైపు చూసింది. తల్లి శోభ కండ్లల్లో నీళ్ళు నిండాయి. తండ్రి శంకర్రావు ముఖంలో విషాదం కమ్ముకుంది. వాళ్ళ పక్కనే మానసి మేనమామ చైతన్య కూర్చొని వున్నాడు. అతడే మానసికి ఈ సంబంధం చూసింది. అతని ముఖంలో నిరాశ ఆవరించింది.

వాళ్ళకు ఎదురుగా సందీప్, అతని తల్లితండ్రి కమల, రామారావులు కూర్చొని వున్నారు. వాళ్ళ పక్కన సోఫాలో సందీప్ అక్క కళ్యాణి బావ మాధవ్ వున్నారు. వాళ్ళందరి ముఖాలు గంభీరంగా వున్నాయి. విశాలమైన డ్రాయింగు రూమ్‌లో నిశ్శబ్ద వాతావరణం ఆవరించింది.

అందమైన సోఫాసెట్లు డ్రాయింగు రూమ్‌లో వలయాకారంలో అమర్చి వున్నాయి. సోఫాల కింద అందమైన కాశ్మీర్ తివాచి. సోఫా సెట్ల మధ్య అద్దాలతో చేసిన సెంట్రల్ టేబిల్. దానిమీద తెల్లని గులాబిపూలతో నిండిన కట్ గ్లాసు ఫ్లవరువాజు. అంతా సాదాగా కనిపించినా చాల ఖరీదైన వస్తువులు! అది సందీప్ పనిచేసే కంపెనీ ఇచ్చిన ఇల్లు. బయట ముప్పై ఆరు డిగ్రీల ఎండవేడి నిప్పులు చెరుగుతున్నా లోపల ఏసీ చల్లదనాన్ని వెదజల్లుతున్నది.

మానసి సందీప్‌ల విడాకులు కోర్టుకెక్కకముందే ఇద్దరి మధ్య స్నేహం ప్రేమలను నిలబెట్టాలని దాంపత్యాన్ని కాపాడాలని ఇద్దరి వైపు నుంచి పెద్దలు వచ్చారు. వాళ్ళు భార్యాభర్తలైన దగ్గర్నుంచి ఇక్కడ వాళ్ళకు దూరంగా ముంబైలో కాపురం పెట్టాక ఎవరికీ వచ్చే తీరిక లేక ఎవరూ ఎప్పుడూ రాలేదు. ఇదిగో ఇప్పుడు మానసి సందీప్‌ల పెండ్లిని నిలబెట్టాలని వచ్చారందరూ.

"నాకు విడాకులు కావాలె" – అన్న మానసి మాటలు విశాలమైన డ్రాయింగు రూమ్‌లో ప్రతిధ్వనించాయి. అందరూ కాస్సేపు మౌనంలో మునిగిపోయారు. ఎవరూ

మాట్లాడలేదు. విషయం ఇంతదూరం వచ్చిందని ఎవరూ అనుకోలేదు. నచ్చజెప్తే మనస్పర్థలు తొలగిపోతాయిలే అనుకున్నారు. "ఇటువంటి విషయాల్లో కాస్త ఓపికపట్టాలె మానసీ" అన్నాడు చైతన్య మౌనాన్ని ఛేదిస్తూ.

"ఎన్నాళ్ళని ఓపిక పడ్తాను" అంది మానసి. ఆమె గొంతులో అసహనం.

మానసి సందీప్‌ల వివాహమై సంవత్సరం దాటింది. ఇట్లా కూతురు పెండ్లి విడాకుల వరకు రావటం శోభ. శంకర్రావులను కలచివేస్తున్నది. ఉన్న ఒక్క కూతురికి మంచి సంబంధం చేయాలని వెతికివెతికి సందీప్‌కిచ్చి పెండ్లి చేసారు.

సందీప్ ఐఐటీలో ఎమ్‌టెక్ చేసి మంచి కంప్యూటరు కంపెనీలో పెద్ద హోదాలోనే చేరాడు. ఆరంభంలోనే ఈ హోదాలో చేరాడు. రాను రాను మంచి భవిష్యత్తు వుంటుందని చైతన్య అక్కకు చెప్పాడు. సందీప్‌ది టాప్ టెన్‌లో వున్న పోస్టు. కంపెనీ బంగళా ఇచ్చింది. కారూ డ్రైవర్ వాళ్ళే ఇచ్చారు. ఇంట్లో వంటకు ఇంటి పనికి మనుషులను పెట్టుకున్నారు. డబ్బుకు హోదాకు కొదువలేదు. మానసికి తను చేయవలసిన పనులేమి లేవు. పనిమనుషులకు పనులు చెప్పి చేయించటం తప్ప.

అన్నీ వున్నాయి. మరి మానసికి ఎందుకీ అసంతృప్తి. సందీప్ ఏమయినా చెడ్డవాడా తాగుబోతా? అంటె అదీ లేదు. ఇద్దరి మధ్య పోట్లాటలు లేవు. మరి మానసికి ఎందుకీ అసహనం! శోభ శంకర్రావులకు, చైతన్యకు అంతుపట్టలేదు. అటు సందీప్ తల్లిదండ్రులు, అక్కాబావలు ఆందోళనగానే వున్నారు. వాళ్లు చూసినంతవరకు ఇద్దరూ నెమ్మదిగానే వుంటారు. ఇద్దరి మధ్య వాగ్యుద్ధాలు లేవు. మరి వ్యవహారం విడిపోయేంత దూరమెందుకు వచ్చింది? - వాళ్ళకర్థమయితలేదు. కావలసిన సుఖాలన్నీ వున్నా మానసి విడాకులు కోరుకుంటుందెందుకు సందీప్ అక్క కళ్యాణికి అంతుపట్టటంలేదు.

ఆమె భర్త టీచరు. వాళ్ళకిద్దరు పిల్లలున్నారు. పిల్లల చదువులు ఇల్లు కట్టిన లోను ఇంటి ఖర్చులకు అన్నిటికి భర్త జీతం ఏదో మీద అప్పు చేయకుండా సరిపోతున్నది. కొత్త అవసరాలకు కొత్త కోరికలకు అవకాశమే లేదు.

సందీప్ తండ్రి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యాడు. పెన్షన్‌తో అతని జీవితం సాదాసీదాగా సాగిపోతున్నది. కొడుకును ఎప్పుడూ ఏమి అడగలేదు. అతడు ఇస్తానని ముందుకు రాలేదు. కొడుకు కోడలు సుఖంగా, సంతోషంగా వుంటే చాలన్నదే వాళ్ళ కోరిక. ఇప్పుడు కొడుకు జీవితంలో పెండ్లయిన సంవత్సరానికే విడాకుల ఉపద్రవం రావటం వాళ్ళను కలచివేస్తున్నది.

మానసిని సందీప్‌ను ఇద్దరినీ అసలు పరిస్థితి ఇందాకా ఎందుకు వచ్చిందని అడిగారు మానసి తల్లిదండ్రులు, మేనమామ. సందీప్ తల్లిదండ్రులు, అక్కాబావలూ అడిగారు. సందీప్ ఎక్కువ మాట్లాడలేదు. అంతా మానసి ఇష్టం అన్నాడు. మానసికి శోభ శంకర్రావులు కావలసినంత కట్నం అడుగకుండానే ఇచ్చారు. పెండ్లి ఘనంగా చేసారు. మానసికి ఇష్టంలేని సంబంధమా అంటే అదేం కాదు. పెండ్లి చూపులయ్యాక మానసి సందీప్‌లు ఏకాంతంలో మాట్లాడుకున్నారు. ఇద్దరూ సంతోషంగానే కన్పించారు. ఇద్దరు పెండ్లికి ఇష్టంగానే వున్నారు. ఇప్పుడేమైంది మరి?

"ఇష్టపడినంకనే పెండ్లి జరిగింది కద! మరి ఇప్పుడీ భేదాలేమిటి ఇద్దరి మధ్య?" అక్కడ కూర్చున్న వాళ్ళకెవరికీ అంతుపట్టటంలేదు.

"రోజూ ఆలస్యంగా అర్ధరాత్రి ఇంటికి వస్తాడు" అంది మానసి మొదటి కారణం బయట పెడ్తూ.

"అవును ఆఫీసులో పని వుంటుంది. పని విడిచిపెట్టి రాలేను కద! అదిగాక నా ఉద్యోగమే మధ్యాహ్నం నుంచి రాత్రి పన్నెండు వరకు. ఈ విషయం మొదటే చెప్పాన్నేను" అన్నాడు సందీప్ ఇదో పెద్ద కారణం కాదన్నట్టుగా.

"రాగానే తిండయినా తినడు. తిన్నావా? అని అడుగడు. 'తిందామా' అని అడిగితే 'నేను తిని వచ్చాను పడుకుంటాను నిద్రొస్తుంది' అని మాట్లాడకుండా నిద్రపోతాడు. ఆఖరికి నువ్వు తిన్నావా? అని కూడా అడుగడు" అంది మానసి కోపంగా.

"నేను రాత్రి భోజనం ఆఫీసులోనే తిని వస్తానని ఎప్పుడో చెప్పాను. అయినా రోజు తిందామా? అని అడుగుతుంది. ఇందులో ఏమైన అర్థముందా?" అన్నాడు సందీప్ వంకరగా పెదవి తిప్పి నవ్వుతూ.

"అంత రాత్రివరకు అతనికోసం ఎదురు చూస్తున్నాను కద! ఒక్క మాటయిన పలకరింపుగా ఏదైన మాట్లాడొచ్చు కద! ఏమి మాట్లాడడు. నేనేదో మాట్లాడటానికి ప్రయత్నిస్తే నిద్రొస్తుంది అంటాడు" మానసి కోపం ఎక్కువవుతున్నది.

"పని చేసి కంప్యూటరు ముందు కూర్చొని కూర్చొని వస్తాను. తలంతా దిమ్మెక్కిపోయి వుంటుంది. ఏం మాట్లాడ్తాను. ఆ టైమ్‌లో.. అంత అర్థం చేసుకోకపోతే ఎట్ల?" సందీప్ సంజాయిషీ చెప్తున్నట్లుగా అన్నాడు నెమ్మదిగా.

"అర్థం చేసుకోకపోతే ఎట్ల!... వెక్కిరిస్తూ అంది మానసి." ఏం అర్థం చేసుకోవాలె... ఒక సెలవు రోజు లేదు. "ఒక ముద్దు మురిపెం లేదు. ఒక ప్రేమ శృంగారం లేదు. బయటికి పోవటం లేదు. నెలకెప్పుడో ఒక్కసారి హోటల్‌కో, స్నేహితులింటికో పోతె అక్కడికి పది ఫోనులు వస్తాయి. మళ్ళా అక్కడ్నుంచి ఆఫీసుకు పని వున్నదంటు పరిగెత్తుతాడు. మళ్ళా నేను ఇంట్లో ఒంటరిగా నిశ్శబ్దంలో..." మానసి కంఠంలో గాద్గద్యం కనిపించింది.

"అదేం లేదు! ఎన్నిసార్లు బయటికి పోలేదు. శని, ఆదివారాలు సెలవులే కద!..." చెప్పబోయాడు సందీప్.

"ఏ శనివారం ఆదివారం! ఇంట్లో వున్నంతసేపు నిద్ర నిద్ర. లేపితే చిరాకు. ఓ ముద్దులేదు మురిపెం లేదు. సంవత్సరం దాటింది కద ఎన్ని రాత్రులు నాతో గడిపాడో అడగండి!" మానసి గొంతు అరచినట్లుగా పైకి లేచింది.

"ఏయ్! అలసిపోయి వస్తాను. రాత్రి నిద్ర వుండదు. నిద్ర రాదా! అది కూడా తప్పేనా" తన తప్పేంలేదన్నట్లుగా అడిగాడు సందీప్.

"అక్కడికీ చెప్పాను షాపింగ్, అవుటింగ్ అంటే నీ స్నేహితులతో పొమ్మని..." మళ్ళీ సందీప్ సర్దబోయాడు తన తప్పేం లేదన్నట్లుగా.

"ఎప్పుడూ ఫ్రెండ్స్‌తో పోతే వాళ్ళేమనుకుంటారు అయినా నీతో పోవాలని నాకు ఇష్టం! నా ఏ ఇష్టం తీర్చావు ఇంతవరకు. చెప్పు!" అంది మానసి గట్టిగా.

"అవును టైమ్ లేక ఎక్కడికి తీసుకపోలేదు. అయినా ఆఫీసు పని ముఖ్యం నాకు. ప్రాజెక్టు పని వున్నప్పుడు నేను రాత్రనక పగలనక కష్టపడక తప్పదు! పని వుంటె చేయకపోతె ఎట్లా?–" సందీప్ గట్టిగానే ప్రశ్నించాడు.

"అయితే! పెళ్ళంటె ఇదేనా? అయినా నీకు ప్రాజెక్టు పని లేనిదెప్పుడు! కంప్యూటరు మీదనే నీ చేతివేళ్ళు! భర్త అంటె కంప్యూటరా? అసలు నా పెండ్లి కంప్యూటరుతో అయిందేమో అనిపిస్తుంది నాకు. నేను విసిగిపోయాను. మాటలేదు మంతిలేదు. కంప్యూటర్! కంప్యూటర్! ఇదే మాట! ఆ మెషీన్‌తోనే పెండ్లయింది నాకు. విసుగొచ్చేసింది నాకు. ఓ సరదా లేదు. నవ్వుతూ మాటలేదు. ఎప్పుడైన సెలవు రోజు ఇంట్లో వుంటాడు కద అనుకుంటె నిద్ర నుంచి లేచి ల్యాప్‌ట్యాప్ ముందేసుకుంటాడు. అక్కడికే బ్రేక్‌ఫాస్ట్, అక్కడికే లంచ్. డిన్నర్! బయటికి పోదామంటె ఇదిగో అయిపోయింది పోదాం – అంటాడు కాని మళ్ళీ ఆ ల్యాప్‌టాప్ ముందే! ఇక నేనెందుకు ఇంట్లో! అందుకే నాకు విడాకులు కావాలె!" అంది మానసి.

ఈసారి ఆమె గొంతులో దుఃఖం ధ్వనించింది. "విడాకులు! విడాకులు! తప్ప వేరేమాట లేదు. కావాలంటె తీసుకో" అరిచాడు సందీప్.

మానసికి దుఃఖంతో కోపం రెట్టింపయింది. "అయినా ఒకసారి చెప్పు! మనం కాపురం పెట్టిందగ్గర్నుంచి ఎన్నిసార్లు కలిసాం! ఎన్నడయినా ప్రేమగా దగ్గరికి తీసుకునే తీరిక, మనస్సు వుందా నీకు? ఓ సరసం లేదు! శృంగారంలేదు! మీ మనస్సులో ఎప్పుడూ ఆఫీసు పని – కంప్యూటరు తప్ప ఏమయిన వుంటుందా? నాతో మాట్లాడే ఉల్లాసం నాతో కలిసే కోరికలే లేవు నీకు! అసలు నీకు మగతనమే లేదు!" గట్టిగా అరిచింది మానసి.

మానసి మాటలు విని అందరూ నిశ్శబ్దంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఎవరికేమనాలో తెలియలేదు. సందీప్ నోట్లోంచి మాట రాలేదు. '

'అందుకే నాకు విడాకులు కావాలె!" అంది మానసి. ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని ఆమె మాటలు ఛేదిస్తూ గట్టిగా వినిపించాయి.

*"పాలపిట్ట" మాసపత్రిక, ఏప్రిల్, 2010*